సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023

I



కాలువలకు నీరు

ధవళేశ్వరం:కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,200, పశ్చిమ డెల్టాకు 6,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



యువతది కీలకపాత్ర

ప్రపంచ దేశాలలో యువత ఎక్కువగా ఉన్నది భారతదేశంలోనే అని నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు.

II లో

అక్రమ మద్యం ధ్వంసం



అమలాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూర్ (ఎస్‌ఈబీ) స్టేషన్ పరిధిలో 28 కేసులకు సంబంధించిన రూ.95 వేల విలువైన అక్రమ మద్యాన్ని గురువారం సాయంత్రం ధ్వంసం చేశారు.

II లో

న్యూస్‌రీల్

నేడు పెదపూడిలో స్పందన

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. తహసీల్దార్ టి.సుబాష్ ఈ విషయం తెలిపారు. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి అధికారులు హాజరు కావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ

పెదపూడి: మండలంలోని కరకుదురులో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయని హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బారావు చౌదరి తెలిపారు. గురువారం వారిద్దరూ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిధుల విడుదలపై విజయవాడలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. నిధుల విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సానా ఉమాపార్వతి, చుండుబాబు, అడబాల నూకరత్నం, కొండయ్యపాలెపు రమణ, వనుం కనక దుర్గమ్మ, చేటకాళ్ల ప్రసాద్, మందపల్లి బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ.19,61,715



అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని హుండీల ఆదాయాన్ని గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. 55 రోజులకు గాను రూ.19,61,715 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పది విదేశీ నోట్లు లభించాయన్నారు. ఆలయ పర్యవేక్షణాధికారి డి.సాయిబాబు పర్యవేక్షణలో ఈ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు, సేవాదళ సభ్యులు ఉన్నారు.

మెడి‘కల సాకారం’



ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్

- నేడు సీఎం జగన్ విజయనగరం నుంచి వర్చువల్‌గా ప్రభుత్వ వైద్య కళాశాలకు ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కొనసాగుతున్న తరగతులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఏడాది నవంబర్‌లో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించారు. పది నెలల్లో శరవేగంగా పూర్తి చేశారు. మొత్తం 32.97 ఎకరాల్లో కళాశాల భవనాలు నిర్మించారు. దీనికి గాను ప్రభుత్వం రూ.475 కోట్లు మంజూరు చేసింది. మెడికల్ కళాశాల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఏడాది గడువులోనే వైద్య తరగతులు ప్రారంభించాలనేదే లక్ష్యం. ఆ సమయానికే అనుకున్న విధంగా వైద్య విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసి తరగతులు నిర్వహిస్తున్నారు.

కళాశాలలో 150 సీట్లు

కళాశాలలో మొత్తం 150 వైద్య విద్య సీట్లు ఉన్నాయి. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసి అనుకున్న విధంగానే ఈ నెల ఒకటో తేదీ నుంచి వైద్య తరగతులను ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడకు వచ్చారు. వారందరికీ హాస్టల్, వసతి, భోజన సదుపాయాలను కల్పించారు. అన్ని సౌకర్యాలతో బాలుర, బాలికల హాస్టళ్లను నిర్మించారు. బోధనకు అవసరమైన అన్ని సదుపాయాలనూ అందుబాటులోకి తీసుకువచ్చారు. వైద్య కళాశాలకు నూతనంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారుల నియామకాలు పూర్తయ్యాయి. మొత్తం 60 మంది వైద్యులు, 482 మంది నర్సులను నియమించారు.

కలెక్టర్ పర్యవేక్షణ

వైద్య కళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయనగరం నుంచి వర్చువల్‌గా దీనిని ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈ పనులను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పర్యవేక్షిస్తున్నారు. ప్రారంభానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. మెడికల్ కళాశాలలో వైద్యవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో సీఎం జగన్ మాట్లాడనున్నారు. ఇందులో భాగంగా కళాశాలలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.



వైద్య కళాశాలలోని తరగతి గది

నియామకాలు పూర్తి



మెడికల్ కళాశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. భవన నిర్మాణం, సిబ్బంది నియామకం పూర్తయ్యింది. కళాశాల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వైద్య విద్యార్థులతో సీఎం జగన్ వర్చువల్ విధానంలో మాట్లాడేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లూ చేశాం. ఏటా 150 మంది విద్యార్థులు రాజమహేంద్రవరం మెడికల్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించనున్నారు. ఇది మంచి పరిణామం.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల

ఆరోగ్యశ్రీ వైద్యసేవలపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించే వైద్య సేవలపై పోస్టర్ల ద్వారా ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం ఆ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ 104 కాల్ సెంటర్, గ్రామ క్లినిక్‌లు, 108 అంబులెన్స్, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందజేస్తున్న వైద్య సేవలు, వైఎస్సార్ యాప్ వినియోగంపై అవగాహన కోసం వాటిని ముద్రించి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వైద్య సేవలు పొందే క్రమంలో ఆరోగ్యశ్రీ ఆసుపత్రికి ఏ పత్రాలు తీసుకువెళ్లాలి, అక్కడ అందిస్తున్న సేవల వివరాలు రూపొందించారన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై సంతృప్తి చెందక పోతే 104 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని, ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆసుపత్రి వర్గాలు డబ్బులు డిమాండ్ చేస్తే 14400కి ఫోన్ చేసి ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలు

నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 16న నిడదవోలు రానున్న సందర్భంగా సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పలు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నట్లు కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఆర్ వర్మ తెలిపారు. సీఎం పర్యటనకు తూర్పు, పశ్చిమ, ఏలూరు ఇతర జిల్లాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రానున్న నేపథ్యంలో ఈ నింబంధనలు విధించినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిడదవోలు మీదుగా ప్రయాణించే వాహన రాకపోకలను నియంత్రించనున్నారు.
- నిడదవోలు పట్టణం లోపలకు లారీలు, ఇతర సరుకు రవాణా వాహనాలకు అనుమతి లేదు.
- కొవ్వూరు, రాజమహేంద్రవరం, తణుకు వైపు నుంచి నిడదవోలు వచ్చే వాహనాలు,లేదా ఆర్టీసీ బస్సులలో వచ్చే వారిని సహా సమిశ్రగూడెం వంతెన వద్ద దించుతారు.
- యర్నగూడెం వైపు నుంచి నిడదవోలుకు వచ్చే ఆర్టీసీ బస్సుల నుంచి ప్రయాణికులు పట్టణ శివారున వెంకటేశ్వరస్వామి గుడి వద్ద వై-జంక్షన్‌లో దిగాల్సి ఉంటుంది.
- పంగిడి నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు నిడదవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రయాణికులు దించి వెళ్లాలి.
- తాడేపల్లిగూడెం వైపు నుండి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను నిడదవోలు పట్టణం మీదుగా అనుమతించరు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి డాక్టర్ వనిత, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, కలెక్టర్ డాక్టర్ మాధవీలత



సభా వేదిక వద్ద ఏర్పాట్లను సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి వనిత, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు శ్రీనివాసనాయుడు, వెంకట్రావు, కలెక్టర్ డాక్టర్ మాధవీలత

- సమీక్షించిన మంత్రులు..అధికారులు
- రేపు కాపు నేస్తం నిధులు బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

నిడదవోలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 16న నిడదవోలు పర్యటన విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి తానేటి వనితలు పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం స్థానిక సెయింట్ ఆంబ్రోస్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో వీరు ఎంపీ మార్గాని భరత్, కలెక్టర్ మాధవీలత, జిల్లా ఎస్పీ జగదీష్, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ విప్పర్తి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా (రాజానగరం), శ్రీనివాసనాయుడు(నిడదవోలు), తలారి వెంకట్రావు(గోపాలపురం)లతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. శనివారం రాష్ట్ర కాపు నేస్తం కింద ఆ సామాజిక వర్గ మహిళల ఖాతాలకు రూ.15 వేలు వంతున ఆయన బటన్ నొక్కి జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. హోంశాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ తమ ప్రభుత్వం అర్హులైన పేదవారికి సంక్షేమ పథకాలను, ఆర్థిక ప్రయోజనాలను అందించి ఆర్థిక స్థితగతులను మార్చుతోందన్నారు.

రోడ్ షోలో వసతులు

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సీఎం పర్యటనకు సంబంధించి బాధ్యులైన అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కేటాయించిన విధులను సమర్థంగా నిర్వర్తించాలన్నారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా శాఖల మధ్య సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్ షోలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఇబ్బంది పడకుండా ఏర్పాటు చేసుకోవాలని మాధవీలత సూచించారు. హెలీప్యాడ్ నుండి సభావేదిక వరకు రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పెద్ద ఎత్తున యువత హాజరవుతారన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని అధికారులకు చెప్పారు. జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ బందోబస్తు, బారికేడింగ్, రూట్ ఆపరేషన్, వాహనాల పార్కింగ్, సభా వేదిక వద్ద భద్రత వంటి అంశాలపై ఫోకస్ పెట్టామన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు పర్యటనకు సంభందించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పర్యటన విజయవంతం కావడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ పద్మావతి, ఆర్డీఓలు మల్లిబాబు, చైత్రవర్షిణి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ సుబ్బలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మతల్లికి రూ.37.59 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్: లోవ దేవస్థానంలోని తలుపులమ్మతల్లికి హుండీల ద్వారా రూ.37,59,808 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయశాఖ పెద్దాపురం తనిఖీ అధికారి సీహెచ్ ఉదయ బాబూనాయుడు, ధర్మకర్తల మండలి చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు ఆధ్వర్యంలో గురువారం లోవలో హుండీలను తెరిచి లెక్కించారు. 50 రోజులకు గాను నాణేల రూపంలో రూ.1,24,395, నోట్ల ద్వారా రూ.36,35,413 వెరసి మొత్తం రూ.37,59,808 ఆదాయం వచ్చిందన్నారు. నగదు లెక్కింపులో ధర్మకర్తలు, దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, అర్చకులు, బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

కాకినాడ సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ పీఎస్ లక్ష్మీ డిగ్రీ కళాశాలలో సుమారు 13 కంపెనీలతో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. దీనికి సంబంధించి గోడపత్రికను గురువారం కలెక్టరేట్‌లో నైపుణ్య అభివృద్ధి అధికారులతో కలసి ఆవిష్కరించారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు పాల్గొనవచ్చని కలెక్టర్ తెలిపారు.

కంటి పాపలను కాపాడుకుందాం

- విద్యార్థులకు నేత్ర పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 1,579 ప్రభుత్వ పాఠశాలల్లో 1.84 లక్షల మందికి నిర్వహణ
- ఈ నెలాఖరు వరకు కొనసాగనున్న వైద్య సేవలు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో గుణాత్మక విద్యను ప్రవేశ పెట్టేందుకు కూడా కృషి చేస్తోంది. అంతేకాకుండా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా విద్యార్థుల్లో కంటి దోషాలను గుర్తించేందుకు నాలుగేళ్లుగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. ప్రాథమిక దశలోనే కంటి సమస్యలను గుర్తించి నివారించే దిశగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సేవలు అందించేందుకు కంటివైద్యులు పాఠశాల బాట పట్టారు.

11 నుంచి ప్రారంభం

జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఏపీ వైద్య విధాన పరిషత్ మార్గదర్శకాలకు అనుగుణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేయాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా నేత్ర దోషాలను గుర్తించేందుకు ఈ నెల 11వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభించారు. విద్యార్థులు ఎదుర్కొనే నేత్ర సంబంధ వ్యాధులు, మెల్లకన్ను, శుక్లాలు, ఇతర కంటి సమస్యలను పరీక్షల్లో గుర్తిస్తారు.

12 బృందాల ఏర్పాటు

వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో జిల్లా అంతటా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెలాఖరు వరకు కంటి పరీక్షల శిబిరాలు కొనసాగనున్నాయి. జిల్లాలో 1,579 పాఠశాలల్లో ఉన్న 1.84 లక్షల మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు దశలవారీగా నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 బృందాలను ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహిస్తుండగా, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన విద్యార్థులకు అవసరమైన మందులు పంపిణీ చేయడం, కళ్లజోళ్లను అందించడం, ఆపరేషన్ అవసరమైతే ప్రధాన ఆస్పత్రులు, రిఫరల్ ఆస్పత్రులో పరీక్షలు చేసి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 33 పాఠశాలల్లో 2,945 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. 305 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు.

కంటి వెలుగుతో..

ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో అమలవుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో 1,58,257 మంది అవ్వాతాతలకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 36వేల మందికి కళ్లజోళ్లు పంపిణీ చేయగా, 845 మందికి కాంటాక్ట్ శస్త్ర చికిత్సలు నిర్వహించారు.

ప్రతి విద్యార్థిని పరీక్షిస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థినీ పరీక్షిస్తాం. ఈ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కంటి సమస్యలకు చెక్ పెట్టినట్లవుతుంది. భవిష్యత్తులో కంటి సమస్యలతో బాధపడే ఒక్క విద్యార్థీ ఉండకూడదన్నది ప్రభుత్వ ధ్యేయం.

– డాక్టర్ ఎ.హేమలత, జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అమలాపురం

క్లుప్తంగా

ఉపాధి కూలీ మృతి

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామంలో ఉపాధి కూలీ ఇంజేటి గని కమ్మ(74) గురువారం గుండెపోటులో మృతి చెందింది. పనులు నిర్వహిస్తున్న సమయంలో ఆమె గుండెపోటుకు గురయినట్లు ఉపాధి హామీ ఏపీఓ ఎండీ నాగప్రసాద్ తెలిపారు. ఆయన ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రాజోలు ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

కాకినాడ క్రైం: తల్లి మందలించిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దాపురానికి చెందిన సాధనబోయిన శివరామకృష్ణ(18) చదువు మానేసి స్థానిక కోళ్ల ఫారంలో కూలీగా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. తాగి వచ్చిన ప్రతిసారి తల్లి రాఘవ తప్పని చెబుతూ మందలించేది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తాగి ఇంటికి వచ్చిన శివరామకృష్ణతో తల్లి వాదులాడింది. ఈ క్రమంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తొలుత పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి శివరామకృష్ణ ప్రాణాలు కోల్పోయాడు.

విద్యార్థి అదృశ్యం


నక్కా శ్రీతేజ

అమలాపురం రూరల్: నడిపూడి గ్రామం నక్కావారిపేటకు చెందిన నక్కా శ్రీతేజ అదృశ్యంపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. 15 సంవత్సరాల వయస్సు గల శ్రీతేజ కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతూ అక్కడే ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్నాడు. 11వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నక్కా శ్రీతేజ హాస్టల్ నుంచి తన ఇంటికి వచ్చాడు. 12 తేదీ ఉదయం 7.30 గంటల సమయంలో నక్కా శ్రీతేజ కొత్తపేటలోని హాస్టల్‌కు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హాస్టల్‌కు చేరుకోలేదు. అతడు ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలుడు తండ్రి నక్కా శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై అందే పరదేశి తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసినవారు 9440796562, 9440796525 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

దేశాభివృద్ధిలో యువతది కీలకపాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

- వీసీ ఆచార్య పద్మరాజు
- 'నన్నయ'లో ప్రారంభమైన 'అద్విక 23' టెక్నికల్ ఫెస్టివల్

రాజానగరం: ప్రపంచ దేశాలలో యువత ఎక్కువగా ఉన్నది భారతదేశంలోనే అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యువత తమ మేధో సంపత్తితో దేశాభివృద్ధిలో కీలకపాత్ర వహించాలని సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో 'అద్విక 23' పేరిట రెండు రోజులపాటు జరిగే టెక్నికల్ ఫెస్టివల్ ప్రోగ్రామ్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసి, మరింత నగిషీ పట్టేందుకు ఇటువంటి ఫెస్టివల్స్ తోడ్పడతాయన్నారు. యువత సెల్‌ఫోన్లకు బానిసలై కాలాన్ని వృథా చేయకుండా బుర్రకు పదునుపెడితే అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో అద్భుతాలను సృష్టించ గలుగుతారన్నారు. నేడు అన్నిరంగాలలోను సాంకేతిక పరిజ్ఞానం అధికంగా ఉంటుందంటూ వైద్యరంగంలో కొన్ని విషయాలను ఉదహరించారు. శిల, శిల్పి, శిల్పం మీరే కావాలంటూ విద్యార్థులను ఆలోచింపజేశారు. ఇంజినీరింగ్ విద్యను నాలుగు సంవత్సరాలపాటు పట్టుదలతో చదివితే ఆపై నాలుగు దశాబ్దాలు ఉన్నతంగా జీవించవచ్చని వీసీ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్ వంటి గొప్ప ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకుని దేశ, రాష్ట్ర ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. వెంకట్రావు, డాక్టర్ కె.నవీన్‌కుమార్‌ల బృందం రచించిన 'అడ్వెన్సెస్ ఇన్ మాథ్యమెటికల్ ఫిజికల్ అండ్ కెమికల్ సైన్సెస్' పాఠ్య పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. గోదావరి జిల్లాల నుంచి సుమారు 1,200 మంది విద్యార్థులు హాజరై పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, టెక్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ప్రెజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ వర్కింగ్ హైపోథిసిస్ డిబేట్ వంటి సాంకేతిక పోటీలలో తమ ప్రతిభను కనబరిచే ప్రయత్నం చేశారు. సాయంత్రం బాస్కెట్ బాల్ కోర్టులో యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్ మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్లు బి.లక్ష్మి, జె. హనుమంతు, బి.సుధాకిరణ్, సీహెచ్ శ్రీవర్మ, డాక్టర్ జి.కీర్తిమరిట, ఆంధ్ర యూనివర్సిటీ స్పోర్ట్సు విభాగం ఆచార్య విజయమోహన్, డైరెక్టర్ డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

నాలుగేళ్ల క్రితమే చంద్రబాబును ప్రజలు శిక్షించారు


బీసీ సంక్షేమ మంత్రి వేణు



నిడదవోలు : ప్రజా న్యాయస్థానంలో చంద్రబాబుకి నాలుగేళ్ల క్రితమే ప్రజా న్యాయవాదులు శిక్ష విధించి, ఎన్నికల్లో 23 స్థానాల్లో కూర్చోపెట్టారని బీసీ సంక్షేమ, సమాచార ఫొటోగ్రఫీ శాఖ మంత్రి సీహెచ్ శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు చేసిన మోసానికి, అవినీతికి ప్రజలు మూడు స్థానాలు మాత్రమే ఇచ్చి ఇంట్లో కూర్చో పెడతారన్నారు. చంద్రబాబుకు రిమాండ్ విధిస్తే దత్తపుత్రుడు పవన్ రోడ్డుపై దొర్లుతున్నాడని విమర్శించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని విడదీసిన పాపం చంద్రబాబుదేన్నారు. కాపుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గత ప్రభుత్వం కాపులను మోసం చేసింది వాస్తవమా కాదా ప్రశ్నించారు. సీఎం జగన్ నిడదవోలులో ఈ నెల16న కాపు మహిళలకు వినాయక చవితి కానుకగా కాపు నేస్తం నిధులు రూ.15 వేలు వారి ఖాతాలకు జమ చేస్తారన్నారు. ఇప్పవరకు కాపు నేస్తం కింద రూ. 2,000 వేల కోట్లు జమ చేశారన్నారు. కాపులకు తీవ్ర అన్యాయం చేసినా చంద్రబాబుకు అధికారం కట్టబెట్టాలనే పవన్‌కల్యాణ్ ఆలోచనను కాపు సోదరులందరూ గుర్తు చేసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

ద్వారంపూడి ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

- సీఐడీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే
- పోస్టింగ్‌లను ఫాలో అవ్వొద్దని వినతి


ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్ అయ్యింది. జూలై 16వ తేదీన ఈ విషయాన్ని గుర్తించారు. దీనిపై ద్వారంపూడి విజయవాడ సీఐడీ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి ఫేస్‌బుక్ ఖాతాలో అనధికార చొరబాటు(హ్యాకింగ్) నేపథ్యంలో గడచిన కొద్దిరోజులుగా వస్తోన్న కొన్ని పోస్టింగ్‌లపై ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఫేస్‌బుక్ ఖాతాను హ్యాక్ చేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవలసిందిగా ఇప్పటికే పోలీసుశాఖను కోరానని చెప్పారు. అప్పటి వరకు తన ఫేస్‌బుక్ ఖాతాలో వచ్చే పోస్టింగ్‌లను ఏ ఒక్కరూ ఫాలో అవ్వొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలు, స్నేహితులు, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

రూ.95 వేల అక్రమ మద్యం ధ్వంసం

- భైండోవర్ గీత దాటిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా
- జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, ఏఎస్పీ ఖాదర్ బాషా


అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఏఎస్పీ ఖాదర్ బాషా, సీఐ శివరామరాజు, సిబ్బంది

అమలాపురం టౌన్: అమలాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ (ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో 28 కేసులకు సంబంధించిన రూ.95 వేల విలువైన అక్రమ మద్యాన్ని గురువారం సాయంత్రం ధ్వంసం చేశారు. అమలాపురంలోని ఎస్ఈబీ స్టేషన్ ప్రాంగణంలో జిల్లా ఎస్ఈబీ ఇన్‌చార్జి, జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు ఆధ్వర్యంలో ఈ అక్రమ మద్యాన్ని నేలపై ఒలకబోశారు. తర్వాత ఆ సీసాలను ధ్వంసం చేశారు. 21 కేసుల్లో పాండిచ్చేరి యానాం నుంచి అక్రమ రవాణా చేసి పట్టుబడ్డ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) 539 సీసాలు, బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా విక్రయిస్తున్న రెండు కేసుల్లో 25 సీసాలను, 19.50 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. కామనగరువు వీఆర్వో అలీ, మహిళా పోలీసు, ఎస్ఈబీ సిబ్బంది కూడా పాల్గొని మద్యాన్ని ఒలకబోశారు.

భైండోవర్‌ను ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా

ఇప్పటికే రెండు అక్రమ మద్యం కేసుల్లో నిందితుడిగా ఉండి ఇటీవల భైండోవర్ కేసు నమోదు అయినా నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.50 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఈబీ జిల్లా ఇన్‌చార్జి ఖాదర్ బాషా తెలిపారు. అంబాజీపేట మండలం గంగలకుర్తి అగ్రహారానికి చెందిన కోలా వీర రాఘవులును మండల మెజిస్ట్రేట్, తహసీల్దార్ ముందు హాజరు పరచగా రూ.50 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లిలో నాటు సారా కాచేందుకు ఉపయోగించే 1,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన కడిమి నాగరాజును అరెస్ట్ చేసినట్లు ఖాదర్ బాషా పేర్కొన్నారు.

గురి చూసి కొట్టారు!

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఇద్దరు పిఠాపురం విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

పిఠాపురం: రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం కాకినాడ డీఎస్సీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూలు గేమ్స్ సెలెక్షన్స్‌లో అండర్ 14 బాలికల విభాగం ఆర్చరీ ఇండియన్ రౌండ్‌లో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పల్లా మహాలక్ష్మి విశేష ప్రతిభ చూపి ఎంపికయిందన్నారు. అదే పాఠశాలకు చెందిన పళ్ల నాని అండర్ 14 బాలుర విభాగం ఆర్చరీ ఇండియన్ రౌండ్‌లో విశేష ప్రతిభ చూపి ఎంపికయ్యాడన్నారు. వీరిద్దరూ త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో జిల్లా తరపున పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన ఇద్దరు విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీవీ రామకృష్ణ, పీడీ మంగయ్యమ్మ అభినందించారు.

పోలవరం కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నల్లజర్ల: పోలవరం కాలువ నీటి ప్రవాహానికి అనంతపల్లి సైఫన్ వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పశువుల కాపరుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం బాగా పాడైపోయింది. ముక్కుపొడం రంగు ప్యాంటు, బ్లూ కలర్ షర్టు వేసుకున్న ఈ వ్యక్తి కాలువ ఎగువ పరీవాహక ప్రాంతం నుంచి కొట్టుకువచ్చినట్టు పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడా? లేక ఎవరైనా హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడవేశారా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు. కాలువ ఎగువ ప్రాంతంలో ఈ తరహా వ్యక్తులు కనపడకుండా పోతే నల్లజర్ల పోలీసులకు సమాచారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆ వార్డు ఇటు... ఈ వార్డు అటు...

జీజీహెచ్‌లో మార్పు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ వార్డులను మార్పు చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి గురువారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. అత్యవసర విభాగంలోని ఎంఎల్‌సీ వార్డులో నానాటికీ పెరుగుతున్న రోగుల రద్దీ దృష్ట్యా ఎక్కువ పడకలు ఉన్న నాన్ ఎంఎల్‌సీకి ఎంఎల్‌సీ వార్డును, తక్కువ పడకలు ఉన్న ఎంఎల్‌సీకి నాన్ ఎంఎల్‌సీ వార్డును తరలిస్తున్నట్లు ప్రకటించారు. సదరు వార్డుల్లో కేసుల రద్దీకి అనుగుణంగా హెచ్చు తగ్గులుంటే ప్రత్యామ్నాయ సర్దుబాట్లతో రోగులకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందిస్తామని ఆమె తెలిపారు.

సరైన ప్రణాళికతో సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక

ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి

కాకినాడ రూరల్: సరైన ప్రణాళిక, సానుకూల దృక్పథం, పాత క్వశ్చన్ పేపర్లు, సీనియర్ల అనుభవాలు మొదలగు వాటి సహాయంతో సివిల్ సర్వీసెస్‌కు సెలెక్టు అవ్వడం సాధ్యమేనని ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్(ఐఆర్ఎస్) సాధు నరసింహారెడ్డి తెలియజేశారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిరణ్ కంటి ఆస్పత్రి ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని కాకినాడ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కె.విజయ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పాల్గొని పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులకు పేదరికం నుంచి ఉన్నత స్థాయికి ఏ విధంగా వెళ్లాలో వీడియోలు, ఫొటోలు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించి సందేహాలు నివృత్తి చేశారు. అనంతరం మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు విద్యార్థుల భవిష్యత్తుపై ఏ విధంగా ప్రభావం చూపుతాయో వివరించారు. కేంద్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలనకు 'నషా ముక్త్ భారత్' కార్యక్రమం ద్వారా ఏ విధంగా చర్యలు తీసుకుంటుందో వివరించారు. కార్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ వీరవెంకటరెడ్డి, హెచ్ఎం మూర్తి, శ్రీకిరణ్ ఆస్పత్రికి చెందిన రాంప్రకాష్ పాల్గొన్నారు.

గొల్లప్రోలులో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలులోని తాళాలు వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్టు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గొల్లప్రోలుకు చెందిన బెజవాడ శివ తన భార్య, కుమారుడితో కలిసి గొల్లప్రోలు గంటావారి గొయ్యి ప్రాంతంలోని తన ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 9న కుటుంబ సభ్యులతో కలిసి తుని మండలం వల్లూరులో ఒక వివాహ వేడుకకు వెళ్లారు. 11వ తేదీన తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానం వచ్చి వెళ్లి చూడగా బీరువాలోని ఉన్న మూడు కాసుల బంగారు హారం, రూ 18000 చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇప్పుడు చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నదెవరు?

- ఎవరినో అందలం ఎక్కించి పల్లకి మోసేందుకు కాపులు సిద్ధంగా లేరు
- పవన్‌కల్యాణ్‌పై ఎమ్మెల్సీ తోట ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: గత ఎన్నికల్లో తాను టీడీపీ నుంచి పోటీ చేసినప్పుడు చంద్రబాబు మోచేతి కింద నీళ్లు తాగుతున్నాడంటూ తనపై విమర్శలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎవరి మోచేతి కింద నీళ్లు తాగేందుకు చంద్రబాబుతో జత కట్టారో చెప్పాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. ఎవరినో అందలం ఎక్కించి పల్లకి మోసేందుకు కాపుజాతి సిద్ధంగా లేదన్నారు. మండలంలోని తాపేశ్వరంలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ సభలో టీడీపీ, జనసేన పార్టీల పొత్తుపై ఎమ్మెల్సీ తోట ఘాటుగా స్పందించారు. 2019 ఎన్నికల ముందు తనతో పాటు మరికొందరు కాపు నేతలు పవన్‌కల్యాణ్‌ను కలిశామన్నారు. అయితే ఆయన విధానాలు, మాట తీరు చూశాక తాను టీడీపీలోనే పోటీ చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. తాను జనసేన పార్టీలో చేరలేదన్న అక్కసుతో అమలాపురం ఎన్నికల సభలో తననే లక్ష్యంగా చేసుకుని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట గుర్తు చేశారు. తాను ఎవరి మోచేతి కింద నీళ్లు తాగేవాడిని కాదని, కోనసీమ గోదావరి నీళ్లు తాగి పెరిగానని స్పష్టం చేశారు. అవినీతిపై పోరాటం చేస్తున్నానంటూ ప్రగల్భాలు పలుకుతున్న పవన్‌కల్యాణ్ అవినీతితో జైల్లో ఉన్న చంద్రబాబును కలిసి ఆయనతో జత కట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాపు నేత సీఎం కావాలని కాపులు కోరుకుంటారని, ఎవరినో అందలమెక్కించి పల్లకి మోసేందుకు కాపులు సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందంటూ గగ్గోలు పెడుతున్న పవన్ కల్యాణ్‌కు కాపు ఉద్యమం సందర్భంగా ముద్రగడ కుటుంబంపై చంద్రబాబు పోలీసులతో అమానుషంగా దాడి చేయించినప్పుడు, కాపులపై అక్రమ కేసులు పెట్టించినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసి రెండు మూడు సీట్లు తెచ్చుకున్నా ఎంతో గౌరవంగా ఉండేదన్నారు. టీడీపీ మనుగడ కోసమే జనసేనతో ఆ పార్టీ పొత్తు పెట్టుకుందన్నారు. చంద్రబాబు పెద్ద అనకొండని, ఆయనతో కలిసి పనిచేసిన సీపీఎం, సీపీఐ తదితర పార్టీలు ఇప్పుడు రాష్ట్రంలో మనుగడ లేకుండా ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీకి అదే గతి పట్టే ప్రమాదముంది జాగ్రత్తంటూ పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్సీ తోట హితవు పలికారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

- రూ.22,10,780 స్వాధీనం
- ఎనిమిది మంది అరెస్టు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉండ్రాజవరం మండలంలోని వడ్లమూరు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ పి.జగదీష్ గురువారం రాజమహేంద్రవరం దిశ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను వెల్లడించారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు కొవ్వూరు సబ్ డివిజన్ డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.రామారావు బృందం వడ్లమూరులోని టేకేరు శ్రీను గెస్ట్‌హౌస్‌పై దాడి చేశారు. అక్కడ కోతబంతి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.22,10,780 నగదు, 9 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. గెస్ట్ హౌస్ యజమాని అయిన భూపతి వెంకట నరసింహరాజు, డొక్కా సోమయ్యలపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ప్రజలు తమ వంతు బాధ్యతగా తమ పరిసరాల్లో ఎక్కడైనా, ఎవరైనా, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వెంటనే డయల్ 100కు, మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. తెలిపినవారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడిన, సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నిందితులను అరెస్టు చేసి, సొమ్ము స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందికి ఎస్పీ నగదు బహుమతిని అందించారు.

ఫెన్సింగ్ పోటీలలో రాణించిన హర్షియ హుస్నా

రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం కైవసం


హర్షితకు బంగారు పతకం అందిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్లు సుగుణారెడ్డి, శృతిరెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-10 ఫెన్సింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన అద్దేపల్లి హర్షియ హుస్నా రాణించి ప్రతిభను కనపరిచింది. ఫాయిల్ వెపన్ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 180 మంది హాజరయ్యారు. గుంటూరు జిల్లా కార్యదర్శి అశోక్‌బాబు వద్ద శిక్షణ పొందుతున్న హర్షియా వివిధ కేటగిరిల్లో రజత, కాంస్య పతకాలు తన ఖాతాలో వేసుకుంది. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హర్షియా ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయని ఏపీ ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన హర్షితను ఏపీ ఫెన్సింగ్ సంఘ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కోచ్ అశోక్‌బాబు అభినందించారు.

వైద్య విద్యారంగంలో నవశకం



రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం
మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తున్న
ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారికి

స్వాగతం... సుస్వాగతం....

ప్రజల ముంగిటకే నాణ్యమైన ప్రభుత్వ వైద్యం, ఇతర సౌకర్యాల కల్పన అందించి, విద్యార్థులు వైద్య విద్య/నర్సింగ్ తదితర ఉన్నత చదువులకై వేరే ప్రాంతాలకు వెళ్ళి ఇబ్బందులు పడకుండా జిల్లాకు మెడికల్ కాలేజి మరియు వైద్య సౌకర్యాలతో అనుబంధ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో
రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం మెడికల్ కాలేజీల నిర్మాణం.
ఒక్కొక్క కాలేజీలో 150 మంది ఎంబిబిఎస్ విద్యార్థులు అడ్మిషన్లు పొందేలా నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుండి అనుమతులు. విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీలు, ఆడిటోరియం నిర్మాణం.







meil
Megha Engineering and Infrastructures Ltd

Irrigation | Drinking Water | Power Generation | Power Transmission | Roads | Hydrocarbons | Mega Gas
Railways | Buildings | Industrial Infrastructures | Effluent Treatment | Defence Equipment

క్లుప్తంగా

ఎన్ని పొత్తులు ఉన్నా గెలుపు వైఎస్సార్ సీపీదే
ఎమ్మెల్యే రాపాక


పొదలాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: ఎంత మంది ఎన్ని పొత్తులు పెట్టుకున్నా అంతిమంగా సీఎం జగన్ నాయకత్వంలో గెలుపు వైఎస్సార్ సీపీదేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం ఆయన పొదలాడలో టీడీపీ–జనసేన పొత్తు ప్రకటనపై స్పందించారు. టీడీపీ, జనసేన పొత్తు అంశం ప్రజలందరికీ తెలుసు అని, గుంపులు గుంపులుగా ఎంతమంది వచ్చినా సీఎం జగన్ సింహంలా సింగిల్‌గానే విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంతమంది బాబులు కలిసినా ఏమీ చేయలేరన్నారు. దళితులు, బీసీలకు, మైనార్టీలకు, మహిళలకు వైఎస్సార్ సీపీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తోడ్పాటును అందిస్తోందన్నారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ సభ్యుడు కటకంశెట్టి ఆదిత్య, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి, దొమ్మేటి సోమరాజు, కొల్లాబత్తుల సతీష్, దార్ల పెదబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి
సీతానగరం: గర్భిణుల, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు సూచించారు. సీతానగరంలోని 8 అంగన్‌వాడీ సెంటర్లు కలిసి అంగన్‌వాడీ సెంటర్1లో గురువారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీ వెన్నెల అప్పల నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

30 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు
మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పి.పుణ్యశాంతి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఈనెల 30 నుంచి నెల రోజులు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా వలంటీర్ల సర్వే శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, తహసీల్దార్ పాపారావు, కోటికేశవరం సర్పంచ్ ముడే సింధూదివ్య, శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల అమ్మాజీ పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయులకు సత్కారం
మధురపూడి: కోరుకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. హిందీ గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు.

దేశభక్తిని పెంపొందిద్దాం
విద్యార్థులకు వీరగాథ 3.0 బోధించాలని డీఈవో కమలకుమారి ఆదేశం

అమలాపురం టౌన్: పాఠశాలల్లో విద్యార్థులకు వీరుల గాథలు వినిపించి వారిలో దేశభక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ఆ దిశగా బోధనలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎం.కమలకుమారి ఆదేశించారు. ఇందు కోసం ప్రభుత్వం నిర్దేశించిన వీర గాథ 3.0 ప్రాధాన్యతాంశంగా గుర్తించి ప్రతీ పాఠశాలలో ఆ అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులతో స్థానిక విద్యానిధి పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డీఈవో కమలకుమారి వీర గాథ 3.0 మార్గ దర్శకాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వీరుల గాథలను వివరిస్తూనే వాటిపై పోటీలు నిర్వహించి ఆ వివరాలను ఎప్పటికప్పుడు వీర గాథ 3.0 పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆమె స్పష్టం చేశారు. వ్యాసరచన, చిత్ర లేఖనం, పెయింటింగ్ ద్వారా మల్టీ మీడియా అంశాల్లో పోటీలను నిర్వహించాలని సూచించారు. పాఠశాల స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ కూడా అందించనున్నామని వివరించారు. జిల్లాలో ఉన్న 2,400 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచాలని డీఈవో ఆకాంక్షించారు. ఇప్పటికే స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం అమలులో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. మన బడి నాడు–నేడు రెండో దశ పనులను వేగవంతం చేయాలని డీఈవో ఎంఈవోలకు సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా కార్యక్రమం రెండో దశకు 194 పాఠశాలలు అర్హత సాధించాయన్నారు. ఈ నెలలో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను కూడా విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కో ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిల్లి రాంబాబు, సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఏఎస్‌ఓ డి.తాతారావు సమావేశంలో మాట్లాడుతూ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా పరమైన కార్యక్రమాలను వివరించారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- 9 నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్
- ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్
- నేటితో ముగుస్తున్న దరఖాస్తు గడువు



రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికెట్ (ఎన్‌ఎంఎంఎస్) పథకాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12వేలు వంతున నాలుగేళ్లకు మొత్తం రూ.48వేలు అందజేస్తారు. అయితే ఇంటర్ విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే చదవాల్సి ఉంటుంది. వసతిగృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వరు. డే స్కాలర్‌గా ఉన్న విద్యార్థులకు మాత్రే ఈ స్కాలర్‌షిప్ అందజేస్తారు.

నేటితో ముగుస్తున్న గడువు

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి శుక్రవారంతో గడువు ముగుస్తోంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఎస్‌ఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పాఠశాల డైస్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాలి. దరఖాస్తులో విద్యార్థి పూర్తి వివరాలను ఉపాధ్యాయుడి సమక్షంలో పొందుపర్చాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలి.

రెట్టింపైన విద్యార్థుల సంఖ్య

గతేడాదితో పోలిస్తే ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2022–23 విద్యా సంవత్సరానికి ఈ ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన ప్రవేశ పరీక్షలో ఉమ్మడి జిల్లా నుంచి 9,498 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ ఏడాది కూడా గతేడాదికి మించి దరఖాస్తులు వస్తాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

డిసెంబర్ 3న అర్హత పరీక్ష

పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబర్ 3న అర్హత పరీక్ష నిర్వహిస్తారు. అదేరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాత పరీక్ష ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు అర్హులు. ఆబ్జెక్టివ్ టైపు విధానంలో 180 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. 90 మార్కులకు రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ ఉండగా, మరో 90 మార్కులకు 7,8వ తరగతులకు చెందిన గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి. పరీక్ష రాసేందుకు మూడు గంటల సమయం కేటాయిస్తారు. జిల్లా ప్రాతిపదికగా స్కాలర్‌షిప్‌నకు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

అర్హతలివీ..

ప్రస్తుతం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 15 చివరి తేదీ కాగా, పరీక్ష రుసుం చెల్లించేందుకు ఈ నెల ఒకటో తేదీ తుది గడువు. ప్రధానోపాధ్యాయులు ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో సమర్పించడానికి ఈ నెల19 చివరి తేదీ.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకునే విధంగా ప్రధానోపాధ్యాయులు చూడాలి. ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి. ఎన్‌ఎంఎంఎస్‌కు అధిక సంఖ్యలో విద్యార్థులు అర్హత సాధించే విధంగా సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- డ్వాక్రా మహిళలతో సమావేశం


రాపాకలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. చినకొండేపూడి, రాపాక గ్రామాల్లో గురువారం డ్వాక్రా మహిళతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలు మహారాణుల్లా జీవిస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చినకొండేపూడిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 7,870 మంది లబ్ధిదారులకు రూ.22.87 కోట్లు, రాపాకలో 5,748 మంది లబ్ధిదారులకు రూ.10.32 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆయనకు వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పోలినాటి రామచంద్రరావు, ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు, రామకృష్ణ, పిచ్చుకల రవికుమార్, రావూరి రామరాజు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు


సమావేశంలో నూతన పింఛన్లు అందజేస్తున్న హోమ్ మంత్రి తానేటి వనిత

- హోమ్ మంత్రి తానేటి వనిత
- నూతన పింఛన్ల అందజేత

కొవ్వూరు: దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. గురువారం పట్టణంలో లిటరరీ క్లబ్‌లో ఫేజ్–2 పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మండలంలో ఆగస్టు తర్వత ఫేజ్–1 కింద 219 మందికి, ఫేజ్–2 కింద 388 మంది ఎంపికయ్యారన్నారు. మండల మొత్తం రూ.10,428 మందికి రూ.2,81,59,750 చొప్పున నెలకి పింఛన్ల అందజేస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వం రూ.1,000 పింఛను అందిస్తే ఇప్పుడు ప్రభుత్వం రూ.2,750 చొప్పున అందిస్తోందని తెలిపారు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ నెలకి రూ.400 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తే నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్న రెట్లు పెంచి రూ.1800 కోట్లు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా పింఛన్ల మంజూరైన లబ్ధిదారులకు మంత్రి వనిత చేతుల మీదుగా అందజేశారు. ఈనెల 16న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా పార్టీ శ్రేణులంతా తరలిరావాలని కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పలూరి సూరిబాబు, తోట నారాయణ,వేములపల్లి రాములు, పరిమి వెంకట్రావు, వేములూరు సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, కొటికల పూడి అబ్రహం, ముదునూరి నాగరాజు,వెంపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులలో భాగంగా రాజంపేట వద్ద వేస్తున్న సిమెంట్ రోడ్డులో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ గ్రామస్తులు గురువారం ఉదయం 8 గంటలకు అడ్డుకున్నారు. పది అంగుళాల మందంతో సిమెంట్ రోడ్డు వేయాల్సి ఉండగా, కేవలం ఐదు అంగుళాల మందంతో వేస్తున్నారన్నారు. ముందుగా లెవిలింగ్ రోడ్డు వేసిన అనంతరం రెండు రోజులు తడిపి ఆపై సిమెంట్ రోడ్డు వేస్తారని, అలా కాకుండా రెండు ఒకేసారి వేస్తున్నారని అభ్యంతరం తెలిపారు. రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్ వచ్చి మిషన్‌ను గమనించగా, సెన్సర్ క్రిందకు దిగడంతో ఈ సమస్య వచ్చిందని తెలియజేశారు. దీంతో వేసిన 12 మీటర్లు సిమెంటు రోడ్డును జేసీబీతో తొలగించారు. సమచారం అందుకున్న ఎస్సై కె.చిరంజీవి అక్కడకు చేరుకుని పరిశీలించారు.

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ తనిఖీ

- వసతులను పరిశీలించిన జీఎం అరుణ్ కుమార్ జైన్
- సిబ్బందితో సమీక్ష


దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బోస్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గురువారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రైల్వేస్టేషన్‌లోని క్రూ కంట్రోల్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బంది బుకింగ్ లాబీ పనితీరును సమీక్షించారు. లోకో పైలెట్లు, గార్డుల విధుల నిర్వహణకు సంబంధించిన క్రూమేనేజ్మెంట్ పని తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రన్నింగ్ స్టాఫ్‌ను డ్యూటీకి తీసుకునే ముందు తగిన విశ్రాంతిని అందించడంపై దృష్టి సారించాలన్నారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లతో మాట్లాడి, వారి పని విధానం, విధులలో ఎదుర్కొనే సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రన్నింగ్ రూమ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లోకో సిబ్బందికి అందుతున్న సౌకర్యాలపై సమీక్షించారు. ముందుగా ఆయన దువ్వాడ, రాజమహేంద్రవరం సెక్షన్ల మధ్య రియర్ విండో తనిఖీ ద్వారా ట్రాకులు, సిగ్నలింగ్ వ్యవస్థ భద్రతా అంశాలను పరిశీలించారు.

వసతుల పరిశీలన

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ను పరిశీలించి, ప్రయాణికులకు అందుబాటులోఉన్న మల్టీపర్పస్ స్టాళ్లు, ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి స్టాళ్లు, ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మెషీన్లు (ఏటీవీఎం) మొదలైన సౌకర్యాలు, వసతులపై జీఎం సమీక్షించారు. ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేలా, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయడంపై అధికారులతో చర్చించారు. స్టేషన్ ప్రాంగణాన్ని, స్టేషన్ ఆవరణలో రైల్ కోచ్ రెస్టారెంట్‌ను సందర్శించారు. అనంతరం రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వరకూ రియర్ విండో తనిఖీ ద్వారా ట్రాకులు, సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రత అంశాలను పరిశీలించారు.


రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న రైల్వే జీఎం

అభివృద్ధిపై దృష్టి సారించండి : ఎంపీ భరత్

ఉభయ గోదావరి జిల్లాలకు ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) అరుణ్ కుమార్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు. స్టేషన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జీఎంతో కలిసి ఎంపీ పరిశీలించారు. పలు సమస్యలను రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు, పలు సూచనలను అందజేశారు.

- ప్రధానంగా రాజమహేంద్రవరం తూర్పు రైల్వే స్టేషను వైపున ఆరో నంబర్ ప్లాట్‌ఫాం ఆవశ్యకతను జీఎంకు వివరించారు. విజయవాడ – విశాఖపట్నం మధ్య గల రాజమహేంద్రవరం ఉభయ గోదావరి జిల్లాలకు ప్రధాన కేంద్రమన్నారు. ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు పలు రైళ్లను రాజమహేంద్రవరంలో ఆపేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.
- రోడ్ కం రైల్వే బ్రిడ్జి మరమ్మత్తుల విషయం అత్యవసరమని జీఎంకు ఎంపీ భరత్ మరోసారి గుర్తు చేశారు. రాజమహేంద్రవరం నగరంలో రైల్వే శాఖకు సంబంధించి ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకునేలా పలు సూచనలు చేశారు.
- గోదావరి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. అనపర్తి, నిడదవోలులో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కు సంబంధించిన అభ్యర్థనను మరోసారి పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.
- అనపర్తి, కేశవరం రైల్వేస్టేషన్ ఎల్సీ గేట్లను క్లోజ్ చేసి ఆర్వోబీల నిర్మాణాలు, రాజమహేంద్రవరం నగరంలో గోదావరి రైల్వే స్టేషను అభివృద్ధి, అక్కడ ఎఫ్ఓబీ నిర్మాణానికి సత్వర ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.
- నగరంలోని అన్నపూర్ణమ్మపేట ఎల్సీ గేట్ స్థానే ఆర్వోబీ నిర్మాణానికి రైల్వే అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన జరిపారని, అక్కడ కూడా పనులు వెంటనే ప్రారంభించాల్సిందిగా కోరారు.
- గోదావరి నదిపై కొత్త వంతెన ఆవశ్యకతను సమగ్రంగా వివరించారు. వీటన్నిటికీ జీఎం సానుకూలంగా స్పందించారని ఎంపీ భరత్ తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, పాలిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడదాం

- చర్యలు చేపట్టిన జగన్ ప్రభుత్వం
- నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ
- త్వరలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌లు



క్యాన్సర్ నిర్ధారణకు స్క్రీనింగ్ పరీక్షలు చేసే వాహనం

రాజానగరం: మారుతున్న ఆహారపు అలవాట్లు మానవాళిని రోగాలకు చేరువచేస్తున్నాయి. అయినా ఏమాత్రం తగ్గకుండా సంప్రదాయ వంటకాలను వదిలేసి, రెడీమేడ్ ఆహారం వైపు ఆకర్షితులవుతున్న జనావళిని వివిధ రకాల రోగాలు హడలెత్తిస్తున్నాయి. వాటిలో ప్రాణాంతక వ్యాధిగా పేరొందిన క్యాన్సర్ బారిన పడి అనేక కుటుంబాలు అతలాకుతలమవుతున్నాయి. ఇటువంటి కొన్ని సంఘటనల గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలనే ఆలోచన చేశారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి, సరైన వైద్య సేవలు అందిస్తే మరణాలను చాలావరకూ అదుపు చేయవచ్చు. త్వరలోనే గ్రామ స్థాయిలో వ్యాధి నిర్ధారణకు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించదలచారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజారోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లా, మండల స్థాయిలోని ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి పర్చడంతో పాటు ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వం వైద్య కళాశాలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాన్సర్ మరణాలను నియంత్రించాలనే ఆలోచనతో గ్రామ స్థాయిలో వ్యాధి నిర్ధారణకు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహించదలచింది. దీనిని పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి, అనకాపల్లి జిల్లాల్లో అమలు చేయనున్నారు. తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోనూ, విశాఖపట్నంలోని హమి బాబా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సహకారంతో అనకాపల్లి జిల్లాలోనూ స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తారు.

ఆరోగ్యశ్రీలో వైద్యం

గ్రామాలలో 30 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు చేస్తారు. మహిళలలో గర్భాశయ క్యాన్సర్‌ను సూచించే పాప్‌స్మియర్, రొమ్ము క్యాన్సర్‌ను సూచించే మామోగ్రఫీ, నోటి క్యాన్సర్ (పురుషులకు కూడా)లకు, ఊపిరితిత్తులు, ఇతర క్యాన్సర్ల నిర్ధారణకు స్క్రీనింగ్ పరీక్షలు అవసరం. అల్ట్రాసౌండ్, మమోగ్రామ్, కొలొనోస్కోపీ, మున్నగు ఆధునిక వైద్య పరికరాలతో కూడిన ప్రత్యేక బస్సులో ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రోగికి ఉచిత వైద్యం అందిస్తారు.

ఏటా 70 వేల కేసులు : 38 వేల మరణాలు

రాష్ట్రంలో క్యాన్సర్ బారిన పడిన వారి సంఖ్య ఏటా 70 వేల వరకూ ఉంటుంది. ఈ వ్యాధితో మరణించే వారి సంఖ్య కూడా 38 వేల పైబడి ఉంటుందని అంచనా. వ్యాధి గురించి సరైన అవగాహన లేకపోవడం, అసలు తాము వ్యాధి బారిన పడ్డామనే విషయాన్ని కూడా సకాలంలో (ప్రారంభం) గుర్తించలేకపోవడం, గుర్తించిన తరువాత ఆర్థికపరమైన సమస్యలతో ఎక్కువ శాతం మంది మరణాలకు చేరువవుతున్నారు. వ్యాధిని గుర్తించే సరికే తీవ్రత 70 శాతం పైబడి ఉంటున్న పరిస్థితులలో ఆయా రోగులను కాపాడలేకపోతున్నారు. క్యాన్సర్‌తో సంభవించిన మరణాలలో 75 శాతం వరకూ వ్యాధి ముదిరిన తరువాత మూడు, నాలుగు స్టేజ్‌లలో గుర్తించినవే.

ఏడాది క్రితమే శ్రీకారం

నియోజకవర్గాన్ని క్యాన్సర్ రహితంగా తీర్చిదిద్దాలనే స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సంకల్పంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌కి ఏడాది క్రితమే శ్రీకారం చుట్టారు. జీఎస్ఎల్ (స్వతంత్ర) క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలి ప్రయత్నంగా సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల పరిధిలో గ్రామ గ్రామానా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అనుమానితులందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్‌లో ఉచిత పరీక్షలు చేశారు.

అందరికీ వైద్యపరీక్షలు



క్యాన్సర్ వ్యాధి బారిన పడి ఎవ్వరూ మరణించకూడదనే ఉద్దేశంతో జీఎస్ఎల్ క్యాన్సర్ ఆస్పత్రి సిబ్బంది, యాజమాన్యం సహకారంతో నియోజకవర్గంలో స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహించి, అనుమానితులకు వైద్య పరీక్షలు చేయించాం. రాజానగరాన్ని క్యాన్సర్ రహిత నియోజకవర్గంగా తీర్దిదిద్దాలనే సంకల్పంతో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతేడాది ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్ల సేవలు కూడా వినియోగించుకుంటూ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించాం. స్క్రీనింగ్ పరీక్షలు కూడా ఖర్చుతో కూడినవైనప్పటికీ పూర్తి ఉచితంగానే చేశారు.

– జక్కంపూడి రాజా, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అవగాహన లేక..



వ్యాధిపై రోగికి సరైన అవగాహన లేక ముదిరిపోయే వరకూ రావడం లేదు, ప్రాథమికంగా నిర్ధారిస్తే త్వరగా నయం చేయడానికి అవకాశాలెక్కువగా ఉంటాయి. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్‌తో కలసి రాజానగరం నియోజవర్గంలో చేపట్టిన ఏడాది కార్యక్రమంతో పాటు ఇంతవరకూ 1,950 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశాం. వీరిలో 48 మందికి లక్షణాలు గుర్తించి, చికిత్సను అందిస్తున్నాం. ఏమాత్రం అనుమానం ఉన్నా వెంటనే స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవడం అందరికీ మంచిది.

– డాక్టర్ తరుణ్ గోగినేని, సర్జికల్ అంకాలజిస్టు, జీఎస్ఎల్ ట్రస్టు క్యాన్సర్ ఆస్పత్రి, రాజమహేంద్రవరం

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
శుక్రవారం ॥ 15-9-2023

ఫ్యాషన్





విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్‌సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్టన్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్



ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మనదైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పాట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.



షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్టన్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసిపోతారు.

చెక్స్ శారీస్..

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.





మనవైన హ్యాండ్లూమ్స్

ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.



వినాయకుడికి వెరైటీ స్వీట్లు



ఈసారి వినాయకుడికి ఎంతో ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు... వైవిధ్యభరితమైన మరెన్నో స్వీట్లను తినిపించి ప్రసన్నం చేసుకుందాం....

వంటిల్లు



పనస పాత్రోలి

కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాతోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలపొడి – అరటీస్పూను.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాతోలీ రెడీ.

బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసిపోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.



పతిశప్త

కావలసినవి: మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అరకప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకోని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.



సేమియా లడ్డు

కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.



స్వీట్ సందేశ్

కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.

తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతులతోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేశ్ రెడీ.



కేసి మిథోయ్

కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.

తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్దికొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.

న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి


విత్య, నిత్య

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో' అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు. పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది. ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు. తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది. కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు. కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధ పడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధ పడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్చింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి. స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్చితే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా. ఇద్దరు కూతుళ్ల చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వాలేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీ మణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జవ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.


తల్లి మీనాతో విత్య, నిత్య